

ప్రశాంతంగా ముగిసిన టెట్ పరీక్షలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

రెండు వారాలుగా జరుగుతున్న ఉపాధ్యాయ అర్హత పరీక్షలు(టెట్) సోమవారంతో ముగిశాయని జిల్లా పాఠశాల విద్యా శాఖాధికారి కె.వాసుదేవరావు తెలిపారు. సోమవారం ఉదయం సెషన్-1లో పేపర్ -1ఎ సోషల్ స్టడీస్ పరీక్షకు 243 మందికి 210 మంది హాజరయ్యారని, 33 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. సెషన్ -2లో సోషల్ స్టడీస్ పేపర్ 2బి పరీక్షకు 225 మందికి 178 మంది హాజరయ్యారన్నారు. 47 మంది గైర్హాజరయ్యారని వాసుదేవరావు తెలిపారు. డిపార్ట్‌మెంటర్ ఆఫీసర్లుగా అర్బన్ రేంజ్ డిఐ బి.దిలీప్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు కోలా సత్యనారాయణ, గణపతి వ్యవహరించారు. పరీక్షలు జరిగినన్ని రోజులూ పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉందన్నారు. వైద్య ఆరోగ్య శాఖ వైద్య శిబిరాన్ని కూడా ఏర్పాటు చేసిందని తెలిపారు.

వరి కోతలు షురూ...

- వరికోత యంత్రాలకు పెరిగిన డిమాండ్
- ఎకరాలకు రూ.4500 చొప్పన వసూలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలో ముమ్మరంగా వరి కోతలు ప్రారంభం అయ్యాయి. జిల్లావ్యాప్తంగా 1.75 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగింది. ఆదివారం సాయంత్రానికి 35,000 ఎకరాల్లో కోతలు పూర్తయినట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. ఇతర జిల్లాల్లో అక్కడక్కడా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో రైతుల ఆందోళనను అవకాశంగా మార్చుకుని హార్వెస్టింగ్ మిషన్ల నిర్వాహకులు ఒక్కసారిగా ధరలు పెంచేశారు. గతంలో గంటకు రూ.2600 వసూలు చేసేవారు. ప్రస్తుతం రూ.3000 చొప్పున వసూలు జరుగుతోంది. ఎకరా కోతకు 1.30 గంటలు పడుతోంది అంటే అక్షరాలా రూ.600 భారం పడింది. గతంలో రూ.3900 ఖర్చు కాగా ప్రస్తుతం రూ.4500కు చేరింది. నెలాఖరు నాటికి 50శాతం కోతలు పూర్తవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా సాగు జరిగిన 1,75 లక్షల ఎకరాలపై అక్షరాలా సుమారు రూ.10.50 కోట్ల భారం పడనుందని అంచనా

ఎకరాకు రూ.4500 కోతలకు ఖర్చు చేస్తున్నాం

గంటకు రూ.3000 చెల్లించాల్సిందేనని హార్వెస్టర్ల యజమానులు డిమాండ్ చేస్తున్నారు. ఎకరా కోతకు గంటన్నర సమయం పడుతోంది. దీంతో రూ.4500 ఖర్చు అవుతోంది. ఐదెకరాల రైతుపై అదనంగా రూ.3000 భారం పడుతోంది. ఇతర జిల్లాల్లో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో హార్వెస్టర్ల యజమానులు అడిగినంత చెల్లించి వరి కోతలు చేయిస్తున్నాము. ప్రభుత్వం, అధికార యంత్రాంగం దృష్టి సారించాలి.

-ఆర్.గోపాలరావు, వరి రైతు, రాజవోలు



తెలుస్తోంది. గతంలో కూలీలే వరి కోతలు చేసేవారు. కాలక్రమేణా ఖర్చుతోపాటు సమయం కలిసి రావడంతో అందరూ హార్వెస్టర్ యంత్రాలపై ఆధార పడుతున్నారు. అందుకే ఏ గ్రామంలో చూసినా హార్వెస్టర్లు ఉంటున్నాయి. తమిళనాడు, తెలంగాణ ప్రాంతాలకు చెందిన హార్వెస్టర్లు కూడా సీజన్‌లో ఇక్కడికి వస్తున్నాయి. ఎకరా పంట కోయాలంటే హార్వెస్టర్‌కు 6 లీటర్ల డీజిల్ ఖర్చవుతుంది. లీటరు డీజిల్‌కు గత సీజన్‌తో పోల్చితే రూ.5 ధర పెరిగింది. గత రెండేళ్లుగా ఎరువులు, పురుగుల మందులు పెరగడంతో పాటు డీజిల్ ఖర్చులు క్రమంగా పెరగడంతో వరి సాగుకు పెట్టుబడి ఖర్చులు ఘణనీయంగా పెరిగాయి. నారు పోయడం, నాట్లు వేయడం, మూడుసార్లు ఎరువులు, రెండుసార్లు కలుపు, జింక్, గడ్డిమందు, కూలీల ఖర్చులు కలిపి ఎకరా సాగుకు రూ.25,000 నుంచి రూ.30,000 వరకూ ఖర్చు అవుతోంది. కౌలు రైతులకు అదనంగా మరో రూ.3000 వరకూ ఖర్చు పెరుగుతోంది. ఎకరాకు సగటున 20 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. కొనుగోలు కేంద్రాల్లో క్వింటాలు రూ.2,180 చొప్పున చెల్లిస్తున్నారు. సకాలంలో నిధులు చెల్లించరనే ఆందోళనతో రైతులు దళారులను ఆశ్రయించి తక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. ఆరు నెలలు కష్టపడిన సొంత భూమి రైతులకు కూలిసైతం గిట్టుబాటు కావడం లేదు. కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారుతోంది.


బుర్రిలంక ర్యాంపులో ఇసుక ట్రాక్టర్లు

దోపిడీకి అడ్డాగా బుర్రిలంక ఇసుక ర్యాంపు?

ప్రజాశక్తి - కడియం

నూతన ఇసుక పాలసీలో భాగంగా ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లపై ఉచితంగా ఇసుకను తవ్వుకుని వెళ్లే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇదే అక్రమార్కులకు వరంగా మారింది. ఇక్కడ దళారులు పెత్తనం చెలాయిస్తున్నారు. వాళ్లకు సంబంధించిన ట్రాక్టర్లు ర్యాంపు వద్ద వుంచి, సొంతంగా కూలీలను నియమించుకుని లబ్ధిదారులతో బేరసారాలు జరుపుతున్నారు. ఉచిత ఇసుక అందకపోగా ట్రాక్టర్ల వద్ద అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి లబ్ధిదారులకు దాపురించింది. బుర్రిలంక ర్యాంపు నుంచి అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని పలుప్రాంతాలకు ఇసుక సరఫరా అవుతోంది. రెండు రోజులుగా ఆలమూరు మండలంలోని పలు గ్రామాలకు చెందిన వందలాది ట్రాక్టర్లపై సమయ పాలన లేకుండా ఇసుకను తరలించుకుపోయి సొమ్ములు చేసుకుంటున్నట్లు వినికిడి. అలాగే కొందరు ట్రాక్టర్ల యజమానులు రహస్య ప్రదేశాల్లో గుట్టలుగా పోసి లారీల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ములు చేసుకుంటున్నట్లు సమాచారం. ఈ అడ్డగోలు దోపిడీపై తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ స్పందించి బుర్రిలంక ఇసుక ర్యాంపును స్థానిక పోలీస్, రెవెన్యూ శాఖలకు సమక్షంలో అందు బాటులోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

ఉచిత బస్సు హామీని అమలు చేయాలి

కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆర్‌టిసి కాంప్లెక్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పిలుపు మేరకు సోమవారం ఆర్‌టిసి కాంప్లెక్స్ ప్రాంగణంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డాక్టర్ టికె.విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇంటింటికీ డప్పు కొట్టి సూపర్ సిక్స్ పథకాలు ఇస్తామని నమ్మబలికారన్నారు. అధికారంలోకొచ్చిన తరువాత ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని విమర్శించారు. సూపర్ సిక్స్ అంతా మోసమన్నారు. స్త్రీ శక్తి పథకం కింద ప్రతి మహిళకు రూ.1,500, బడికెళ్లే ప్రతి విద్యార్థికి రూ.15 వేలు, నిరుద్యోగ యువతకు నెలకు రూ.3వేలు ఇస్తామని ఇచ్చిన హామీలు ఏం చేశారని ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు వాలంటీర్లకు రూ.10వేల జీతం పెంచుతామని చెప్పిన కూటమి నాయకులు ఇప్పుడు ఆ వ్యవస్థనే తొలగించడం మోసం కాదా అని ప్రశ్నించారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రతి నియోజకవర్గం నుంచి వెయ్యి పోస్టు కార్డుల ఉద్యమానికి శ్రీకారం చుడతామని తెలిపారు. పీసీసీ అధికార ప్రతినిధి అమర్ జహా బేగ్ మాట్లాడుతూ ఎన్‌డిఎ కూటమి మద్యంపై చూపే మక్కువను మహిళల ఉచిత బస్సు సౌకర్యంపై చూపడం లేదన్నారు.


ఆర్‌టిసి క్లాంప్లెక్స్ వద్ద నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

సూపర్ సిక్స్ దేవుడెరుగు, కనీసం సింగిల్ రన్ కూడా ఈ ప్రభుత్వం చేయలేక పోతోందని విమర్శించారు. ఈ సందర్భంగా బస్సులను కొంత సేపు అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పిసిసి జనరల్ సెక్రటరీ అరుణకుమారి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు మోత శారద, నగర కాంగ్రెస్ అధ్యక్షులు బాలేపల్లి మురళీధర్, డాక్టర్ వడయార్, పట్నాల శ్రీనివాస్, డాక్టర్ వై.శ్రీనివాస్, బిల్డర్ చిన్న, చింతాడ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

26న ఆర్ట్స్ కళాశాలలో మెగా జాబ్ మేళా

సిటీ ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈనెల 26 న ఆర్ట్స్ కళాశాల ఆవరణలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు రాజమండ్రి సిటీ ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. తిలక్ రోడ్డులోని తన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. గత ఐదేళ్లుగా డ్రగ్స్, క్రైమ్‌కు అడ్డాగా నగరాన్ని వైసిపి నాయకులు మార్చేశారన్నారు. నిరుద్యోగం అత్యధికంగా ఉన్న రాష్ట్రంగా ఐదేళ్లలో ఎపి ఉందన్నారు. ఉద్యోగ కల్పన కల్పించి, భవిష్యత్తు తీర్చిదిద్దాలన్నదే ఎన్డీయే కూటమి లక్ష్యమన్నారు. 'మీ భద్రత మా బాధ్యత' పేరుతో కార్యక్రమాలు చేపట్టి క్రైమ్, డ్రగ్స్‌కి అలవాటుపడిన యువతను గుర్తించి వారిని మంచి మార్గంలోకి మళ్లించేందుకు, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ఐటి హబ్‌గా రాజమండ్రి తీర్చిదిద్దాలని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చానని, దాన్ని నిలబెట్టుకునేందుకు కృషి చేస్తున్నానని తెలిపారు. ఇందులో భాగంగానే జాబ్ మేళాను నిర్వహిస్తున్నానని తెలిపారు. దీన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాజమండ్రి నగరపాలక సంస్థ ఎన్నికలు అధిష్టానం నిర్ణయం మేరకు జరుగుతాయని, ఈ విషయంలో తనకు మరో ఎంఎల్ఎకు మధ్య ఎలాంటి మనస్పర్థలు తలెత్తే అవకాశం లేదన్నారు. ఈ సందర్భంగా మెగా జాబ్ మేళా కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సమావేశంలో రాజమండ్రి పార్లమెంట్ డాక్టర్స్ సెల్ అధ్యక్షులు యాళ్ల ప్రదీప్, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా దేవివరప్రసాద్, ఉమా మార్కండేయ స్వామి ఆలయం మాజీ ఛైర్మన్ యిన్నమూరి దీపు తదితరులు పాల్గొన్నారు.

అజ్జరంలో గ్రామ సభ

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని అజ్జరంలో భూ రీ సర్వేపై సోమవారం గ్రామ సభను తహశీల్దార్ డి.అచ్యుతకుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. రీ సర్వేలో జరిగిన భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు, తప్పులను సరిదిద్దుకునేందుకు లబ్ధిదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. గ్రామసభలో 6 అర్జీలు వచ్చాయని తెలిపారు. ఈ సభలో సర్పంచ్ గారపాటి నాగసుధ, మండల సర్వేయర్, డిటి సన్నీబాబు, రెవెన్యూ అధికారి పావని సూరిబాబు, నాయకులు పూడి శంకరం, సురేష్ రాజు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు

బాలికలకు విద్య అవసరం

ప్రజాశక్తి -గోకవరం

బాలికలకు విద్య అవసరమని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎల్.రంజని అన్నారు. మండలంలోని రంప ఎర్రంపాలెం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం బేటి బచావో బేటి పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. బాల్య వివాహాలు, బాలిక చట్టాలపై ఆమె అవగాహన కల్పించారు. అనంతరం వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రమీలరాణి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడి సిబ్బంది టి.బొజ్జమ్మ, కె.కృష్ణవేణి, కె.మైథిలి, జి.అమ్మాజీ పాల్గొన్నారు.



ఘనంగా పోలీసు అమరవీరుల దినం

ప్రజాశక్తి - యంత్రాంగం

పోలీస్ అమరవీరుల దినంను జిల్లాలో పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. పోలీసు అమరవీరుల స్మారక స్థూపం వద్ద పూలమాలలు, బొకేలు ఉంచి నివాళుర్పించారు. రాజమహేంద్రవరంలో జిల్లా పోలీసు కార్యాలయంలో అమరవీరుల స్థూపం వద్ద ఎస్‌పి డి.నరసింహకిషోర్ పూలమాలలు ఉంచి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 1959లో లద్దాఖ్‌లో ఇండియా చైనా బోర్డర్ వద్ద చైనీస్ ట్రూప్ అంబుష్ చేయగా ఆ కాల్పుల్లో 10 మంది భారత జవానులను మృతి చెందారు. దీంతో దేశవ్యాప్తంగా అక్టోబర్ 21న పోలీసుల అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహిస్తుమన్నారు. దేశవ్యాప్తంగా ఏడాది కాలంలో 214 మంది పోలీసులు అమరులయ్యారన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇద్దరు(నరేంద్ర, గణేష్) విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించారన్నారు. నేటి నుంచి వచ్చే 11 రోజుల పాటు పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని అన్నారు. పోలీసు కుటుంబాల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ముఖ్యఅతిథిగా కలెక్టర్ పి.ప్రశాంతి హాజరై మాట్లాడారు. దేశ సార్వభౌమాధికారాన్ని, దేశ పౌరుల ప్రజాస్వామ్యాన్ని రక్షించడంలో పోలీసులు ప్రదర్శించిన త్యాగాలను స్మరించుకునే రోజు అని అన్నారు. అనారోగ్యం కారణంగా మృతి చెందిన పి.శ్రీదేవి, వి.శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు అడిషనల్ కార్పస్ ఫండ్ కింద రూ.లక్ష, ఆదరణ పథకం కింద రూ.లక్ష, ఫ్లాగ్ ఫండ్ కింద రూ.25 వేల చెక్కులను కలెక్టర్, ఎస్‌పి అందించారు. ఈ కార్యక్రమంలో జెసి చిన్ని రాములు, మున్సిపల్ కమిషనర్ కేతన్ గార్గ్, అడిషనల్ ఎస్‌పి(లా అండ్ ఆర్డర్) అల్లూరి వెంకటసుబ్బరాజు, ఎస్‌బి సిఐ అనసూరి శ్రీనివాసరావు, డిఎస్‌పిలు, సిఐలు, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


అమరుల కుటుంబాలకు చెక్కులు అందిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

తాళ్లపూడిలో ఎస్ఐ టి.రామకృష్ణ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ అమరవీరుల త్యాగాలు మరువలేనివని అన్నారు. తాళ్లపూడి బస్టాండ్ సెంటర్ నుండి ఆటో స్టాండ్ వరకు జరిగిన ఈ ర్యాలీలో పోలీస్ సిబ్బందితోపాటు ఆటో యూనియన్ ఓనర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు. **ఉండ్రాజవరంలో** ఎస్ఐ జి.శ్రీనివాసరావు, స్టేషన్ సిబ్బంది, మండలంలోని గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పోలీస్ అమరవీరులకు ఘన నివాళు లర్పించారు. అనంతరం ఉండ్రాజవరం సెంటర్ నుండి హై స్కూల్ వరకు ర్యాలీ నిర్వహించారు. **చాగల్లులో** ఎస్ఐ కె.నాగేంద్ర ఆధ్వర్యంలో చాగల్లు జడ్‌పి హైస్కూల్ హెచ్‌ఎం పి.వీర్రాజు, ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. **పెరవలి** పోలీస్ స్టేషన్‌లో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినాన్ని నిర్వహించారు. అమరవీరులకు నివాళులర్పిస్తూ శ్రద్ధాంజలి ఘటించారు అనంతరం గ్రామంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఎఎస్ఐలు సూర్యచంద్రరావు, ప్రసాదరావు, కానిస్టేబుల్స్ శ్రీను, శ్రీనివాస్ హనుమంతు, జాహ్నవి, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

పంచారామాలు, శబరిమలైకు ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

కార్తీక మాసాన్ని పురస్కరించుకొని రాజమండ్రి డిపో నుంచి పంచారామాలు, శబరిమలైకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని డిపో మేనేజర్ షేక్.షబ్నం తెలిపారు. ఈ బస్సులు కార్తీకమాసంలో ప్రతి ఆదివారం సాయంత్రం 7 గంటలకు రాజమండ్రి నుంచి బయలుదేరి అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట పుణ్యక్షేత్రాలను ఒకే రోజు అనగా కార్తీక సోమవారంనాడు సందర్శించుకుని సోమవారం రాత్రి 8 గంటలకు రాజమండ్రి కాంప్లెక్స్‌కు చేరుకుంటాయన్నారు. బస్సులు నవంబర్ నెలలో ప్రతి ఆదివారం అనగా నవంబర్ 3, 10, 17, 24, డిసెంబర్ 1న బయలుదేరుతాయన్నారు. టిక్కెట్ల ధరలు ఎక్స్ ప్రెస్‌కు రూ.850, అల్ట్రా డీలక్స్ రూ.1040, సూపర్ లగ్జరీ రూ.1090గా నిర్ణయించామన్నారు. రిజర్వేషన్ టికెట్లు రాజమండ్రి బస్టాండ్, గోకవరం బస్టాండ్, ఆన్ లైన్ లోనూ, టికెట్ల ఏజెంట్ల వద్ద అందుబాటులో ఉంటాయన్నారు. శబరిమలైకు ఒక్కొక్కరికి 5 రోజుల యాత్రకు రూ.5వేలు, 7 రోజుల యాత్రకు రూ.6వేలు, 10 రోజుల యాత్రకు రూ.7,500గా ధర నిర్ణయించామన్నారు. వీటికి సంబంధించిన కరపత్రాలు, గోడ పత్రికలు, బ్యానర్లను జిల్లా డిపిటిఒ కె.షర్మిలఅశోక ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాజమండ్రి డిపో మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్), స్టేషన్ మేనేజర్ తదితరులు పాల్గొన్నారు. వివరాలకు 9959225535, 7382912141 నెంబర్లను, విచారణకు 08832468625 నెంబర్‌ను, రిజర్వేషన్‌కు 9959225561, 9502300189 నెంబర్లను సంప్రదించాలన్నారు.

నేటి నుంచి ఆధార్ ప్రత్యేక క్యాంపులు

ప్రజాశక్తి - తాళ్లపూడి

కలెక్టర్ ఆదేశాల మేరకు తాళ్లపూడి మండలంలో మంగళవారం నుంచి 25వ తేదీ వరకు ఆధార్ ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నామని ఎంపిడిఒ రమణ తెలిపారు. 22వ తేదీ మంగళవారం తాళ్లపూడి, మలకపల్లి ఉన్నత పాఠశాల వద్ద 23వ తేదీ తాళ్లపూడి స్పెషల్ పాఠశాల, ఎద్దేవం ఉన్నత పాఠశాల వద్ద, 24వ తేదీ ఏగేశ్వరపురం ఉన్నత పాఠశాల వద్ద రావూరుపాడు గ్రామ ప్రజల కోసం పెద్దేవం ఉన్నత పాఠశాల వద్ద, 25వ తేదీ వేగేశ్వరపురం ఉన్నత పాఠశాల వద్ద ఈ ఆధార్ ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తామన్నారు. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పెరవలి : మండలంలో ఆధార్ స్పెషల్ క్యాంపులను ఈ నెల 22 నుంచి నిర్వహిస్తున్నామని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఎస్‌వి.రమణ తెలిపారు. 22, 23 తేదీల్లో ముక్కామల హై స్కూల్, 24, 25 తేదీల్లో మల్లేశ్వరం హైస్కూల్లో క్యాంపులు నిర్వహిస్తామన్నారు. ఉదయం 9:30 గంటల నుంచి ఇవి ప్రారంభమవుతాయని తెలిపారు.

పెరవలి నూతన ఎస్ఐగా వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - పెరవలి

పెరవలి పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా ఎం.వెంకటేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం నుంచి బదిలీపై వచ్చారు. అందరి సమన్వయంతో ప్రజా సమస్యలు పరిష్కరిస్తానన్నారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు


సత్తిబాబును సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

గాజింగం సత్తిబాబుకు సన్మానం

ప్రజాశక్తి-గోకవరం

గోకవరం సొసైటీ మాజీ ఛైర్మన్ గాజింగం సత్తిబాబును భూపతిపాలెం పూర్వపు విద్యార్థులు సోమవారం ఘనంగా సన్మానించారు. భూపతిపాలెం గురుకుల పాఠశాలలో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడినప్పుడు విద్యార్థులు అంధకారంలో ఉండడంతో అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. వారి సమస్యలు పరిష్కరించాలని పాఠశాల ఛైర్మన్ గళ్ల రామచంద్రరావు సొసైటీ మాజీ ఛైర్మన్ గాజింగం సత్తిబాబుకు తెలిపారు. వెంటనే స్పందించిన సత్తిబాబు రూ.2.50లక్షలతో ఇన్వెర్టర్లను సమకూర్చారు. విషయం తెలుసుకున్న పాఠశాల పూర్వపు విద్యార్థుల ఆలోమీనియం అసోసియేషన్ అఫ్ ఎపిఆర్ స్కూల్ భూపతిపాలెం అధ్యక్షుడు రత్నాకర్ పిబి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో సత్తిబాబును సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ బి.రవి, ఛైర్మన్ గళ్ళ రాము, వైస్ ఛైర్మన్ రాజీవ్, ఉపాధ్యాయులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.


సోలార్ వాడకంతో డబ్బులు ఆదా

ప్రజాశక్తి - తాళ్లపూడి



విద్యుత్ వినియోగదారులు సోలార్ వాడకంతో డబ్బులు ఆదా చేసుకోవచ్చని మండల ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షులు, ప్రముఖ వ్యాపారవేత్త సింహాద్రి జనార్ధనరావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సోలార్ పవర్ సిస్టంకు సంబంధించిన వర్క్ షాప్, అవసరమైన వస్తువులు అందుబాటులోకి తెస్తూ తాళ్లపూడి గ్రామంలో నూతనంగా ఏర్పాటుచేసిన ముబారక్ సుహనా సోలార్ పవర్ సిస్టమ్స్‌ను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సోలార్ వాడకం వల్ల ఖర్చు తగ్గడమే కాకుండా వాతావరణ కాలుష్యాన్ని కూడా తగ్గించొచ్చన్నారు. పవర్ సిస్టమ్స్ ప్రతినిధి సాబిర్ భాషా మాట్లాడుతూ సోలార్ వాడకం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధినేత వరుణ్, బెనర్జీ, రెవెన్యూ కార్యాలయ గణాంక అధికారి జోడాల వెంకటేశ్వరరావు, గ్రామస్తులు కొండూరి సూర్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



'పుల్లా' కుటుంబానికి ప్రముఖుల పరామర్శ

ప్రజాశక్తి- కడియం

కడియపులంకలో ఇటీవల మృతి చెందిన శ్రీసత్యదేవ నర్సరీ అధినేత పుల్లా సత్యనారాయణ కుటుంబాన్ని సోమవారం పలువురు ప్రముఖులు పరామర్శించారు. రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్, మాజీ ఎంఎల్ఎ జక్కంపూడి రాజా తదితరులు పరామర్శించారు. చంటియ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంటియ్య నర్సరీ రంగానికి చేసిన కృషి మరువలేనిదన్నారు. ఆయన మరణం నర్సరీ రంగానికి తీరానిలోటు అన్నారు. చంటియ్యతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. చంటియ్య కుమారుడు పెద్ద సత్యనారాయణ, చంటియ్య సోదరుడు ఆంజనేయులు, పుల్లా సోదరులు వీర వెంకటరావు, వీర్రాజు, చిన్న సత్యనారాయణ, డాక్టర్ రామకష్ణ,శ్రీకాంత్ కుటుంబ సభ్యులకు సంతాపాన్ని తెలియజేశారు. పరామర్శించిన వారిలో పలువురు కూటమి నాయకులు, వైసిపి నాయకులు, నర్సరీ రైతులు వున్నారు.


నివాళులర్పిస్తున్న ఎంఎల్ఎ గోరంట్ల తదితరులు

సమాజ సేవకు ముందుకు రావాలి

రాజమహేంద్రవరం : సమాజ సేవ చేసేందుకు బాధ్యత కలిగిన ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక 42వ డివిజన్‌కు చెందిన తెలుగు యువత నగర కార్యనిర్వాహక కార్యదర్శి దుద్దేటి నాగేంద్ర యాదవ్, సీరా తులసి, చిన్నయ్య, సుబ్రహ్మణ్యం, బాలకృష్ణ, కేశవ్, శేఖర్, పల్ల గణేష్, మోహన్, కౌశిక్ సంయుక్త సారథ్యంలో ఆశయం ఫౌండేషన్ ఏర్పాటు చేశారు. ఈ ఫౌండేషన్ ప్రారంభోత్సవాన్ని పురష్కరించుకుని స్థానిక 37వ డివిజన్ వీరభద్రపురంలోని కస్తూరిబా స్త్రీల వృద్ధాశ్రమంలోని వృద్ధులకు దుస్తులు, బెడ్ సీట్లు, సబ్బులు, ఆయిల్, పండ్లు తదితర నిత్యావసర వస్తువులను గన్నికృష్ణ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ అభాగ్యులకు తోడ్పాటునందిస్తున్న ఆశయం ఫౌండేషన్ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆడారి లక్ష్మీనారాయణ, కెవి.శ్రీనివాస్, పేరూరి అంజి, దుద్దేటి ఈశ్వరరావు, వానపల్లి శ్రీనివాస్, సావిత్రి, అప్పలరాజు పాల్గొన్నారు.

నానాజీ మృతికి సంతాపం

పెరవలి: పెనుగొండ మాజీ ఎంఎల్ఎ కూనపరెడ్డి వీరరాఘవేంద్రరావు(చినబాబు) తనయుడు, వైసిపి నాయకుడు, ఉమ్మడి జిల్లా సహకార బ్యాంకు డైరెక్టర్ పెనుగొండ సొసైటీ అధ్యక్షుడు జవ్వాది లక్ష్మయ్య నాయుడు(నానాజీ) అకాల మృతికి జనసేన నాయకులు ప్రగాఢ సంతాపం తెలిపారు. మతుడు నానాజీ తాత జవ్వాది శ్రీరంగనాయకులు, ముత్తాత జవ్వాది లక్ష్మయ్య నాయుడు ఎంఎల్ఎగా పనిచేశారు. సంతాపం తెలిపిన వారిలో అన్నవరప్పాడుకు చెందిన జనసేన నాయకుల పి.నాగేశ్వరరావు, పి.సూర్యనాగేశ్వరరావు తదితరులున్నారు.

నేరాలు ఘోరాలు

గుర్తు తెలియని వ్యక్తి మరణం

ప్రజాశక్తి - శంఖవరం

అన్నవరం రైల్వే స్టేషన్లోని ఒకటో నెంబర్ ప్లాట్‌ఫారంలో గుర్తు తెలియని వ్యక్తి సోమవారం అనారోగ్యంతో మరణించాడు. అతడి మృతదేహాన్ని తుని ప్రభుత్వాసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. మృతుని వివరాలు తెలిస్తే తుని రైల్వే పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

దాడిపై ఫిర్యాదు

ప్రజాశక్తి-ముమ్మిడివరం

ఉపాధి కోసం మురుగు కాలవ పక్కన ప్రభుత్వ భూమిలో బడ్డీ కొట్టు పెట్టుకుంటే, గ్రామానికి చెందిన కొంతమంది ఆ బడ్డీని తొలగించడమే కాక అడ్డుకున్నందుకు తన పైన, తన మనవడిపైనా దాడి చేసి గాయపరిచారని బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. నగర పంచాయతీ పరిధిలోని సోమిదేవర పాలేనికి చెందిన వస్త్రాల సుబ్రమణ్యం బడ్డీ ఏర్పాటు చేసుకోగా సోమవారం గ్రామానికి చెందిన కొంతమంది తాను ఏర్పాటు చేసిన బడ్డీని తాడు కట్టి ట్రాక్టర్‌తో ఊరు బయటకు లాగేశారని, అడ్డుకునే ప్రయత్నం చేసినందుకు తన పైన మనవడు అతికల గణేష్‌పైన దాడి గాయపరిచారని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సారా విక్రేత అరెస్ట్

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండలం లోని రాజవరం గ్రామ శివారు నాటు సారాను స్వాధీనం చేసుకుని గ్రామానికి చెందిన కోట రామకృష్ణను అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు. కొత్తపేట కోర్టుకు రిమాండ్ నిమిత్తం తరలించి కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

స్వర్ణాంధ్ర సేవలు స్ఫూర్తిదాయకం

ఎయు న్యాయ కళాశాల ప్రిన్సిపల్ సీతా మాణిక్యం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం



ప్రిన్సిపల్ సీతామాణిక్యంను సత్కరిస్తున్న స్వర్ణాంధ్ర రాంబాబు

అన్నార్తులు ఆకలి తీర్చడంతోపాటు మహిళలకు ఉపాధిలో శిక్షణ కల్పించడంలో స్వర్ణాంధ్ర సేవా సంస్థ స్ఫూర్తివంతమైన సేవలు అందిస్తుందని ఆంధ్ర యూనివర్సిటీ న్యాయ కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్.సీతామాణిక్యం ప్రశంసించారు. సోమవారం లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వద్ధాశ్రమంలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. నగర ప్రముఖులు, హీరో సైకిల్స్ వ్యవస్థాపక డీలర్ కీర్తిశేషులు సిపి రెడ్డి జ్ఞాపకార్థం ఈ అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీతామాణిక్యం హాజరై మాట్లాడారు. అన్నార్తుల ఆకలి తీర్చడం కోసం స్వర్ణాంధ్ర సేవా సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. మహిళలలో సంకల్పం ఉంటే ఎంత ఎత్తుకైనా ఎదగొచ్చు అనేదానికి తానే ఉదాహరణ అని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. చిన్న వయసులోనే వివాహం జరిగిన, తదుపరి తన భర్త ప్రోత్సాహంతో ప్రతిష్టాత్మక న్యాయ కళాశాల ప్రిన్సిపల్ స్థాయికి ఎదిగానని ఆమె తెలిపారు. దీనికి తోడ్పాటున అందించిన కుటుంబ సభ్యులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను స్వర్ణాంధ్ర వ్యవస్థాపకులు రాంబాబు దుస్సాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందించారు. రాంబాబు మాట్లాడుతూ సీతా మాణిక్యం రాజమండ్రి ఆడపడుచుగా ఈ స్థాయికి ఎదగడం ఎంతో గర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమంలో స్వర్ణాంధ్ర సిబ్బంది, సిపి రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు గుర్తించి పరిష్కరిస్తాం

ప్రజాశక్తి-రామచంద్రపురం



మాట్లాడుతున్న మంత్రి సుభాష్

గ్రామాల్లోని సమస్యలను గుర్తించి పరిష్కరిస్తామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. కె.గంగవరం మండలంలోని పాతకోట కోటిపల్లి గ్రామాలలో ఏర్పాటు చేసిన బహిరంగ సభల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. మంత్రి మాట్లాడుతూ మన ఊరు మన సుభాష్ అనే కార్యక్రమం ప్రజలకు మరింత చేరువయ్యేలా స్థానిక నాయకులు పని చేయడం, గ్రామ స్థాయి సమస్యలను గుర్తించడం, పరిష్కారం చూపడం ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. స్థానిక సమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాతకోట, కోటిపల్లి గ్రామపెద్దలు రామచంద్రపురం నియోజవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ కూటమి నాయకులు సంఖ్యలో పాల్గొన్నారు.

తాత్కాలిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - కడియం

మండలంలోని కడియపులంకలో తాత్కాలిక పిహెచ్‌సిని రూరల్ ఎంఎల్‌ఎ గోరంట్ల బుచ్చియ్య చౌదరి సోమవారం ప్రారంభించారు. గ్రామానికి గతంలోనే పిహెచ్‌సి మంజూరైంది. దాతల సహాయంతో స్థల సేకరణ మరియు శంఖు స్థాపన కూడా జరిగింది. కాని భవన నిర్మాణం జరగలేదు. బిల్డింగ్ లేని కారణంగా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌కి మాత్రమే వైద్యులు పరిమితమయ్యారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అవసరం అని గుర్తించిన స్థానిక నాయకుల సలహా మేరకు కడియపులంక గ్రామంలోని టూరిజం భవనంలో తాత్కాలికంగా పిహెచ్‌సిని ఏర్పాటు చేశారు. దీన్ని ఎంఎల్‌ఎ బుచ్చయ్యచౌదరి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాటంశెట్టి రాంజీ, ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్, వైస్ ఎంపిపి పంతం గణపతి, నాయకులు మార్గాని సత్యనారాయణ, గట్టి నర్సయ్య, గట్టి సుబ్బారావు బోడపాటి రాజేశ్వరి,ఆకుల శ్రీధర్, ఎంపిడిఓ రమేష్, వైద్యాధికారులు ఎన్.జెస్సీసుప్రియ, ఎం.మణిజ్యోష్ణ, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



తాత్కాలిక పిహెచ్‌సిని ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ గోరంట్ల

సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలి

ప్రజాశక్తి-అమలాపురం

కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయానలి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు డిమాండ్ చేశారు. అమలాపురం ప్రెస్ క్లబ్‌లో సోమవారం పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక్క పెన్షన్ తప్ప మిగతా హామీలన్నీ హామీలుగానే ఉన్నాయని అన్నారు. రాష్ట్రంలో నిజమైన ప్రతిపక్ష పాత్రను కాంగ్రెస్ పార్టీ చేపట్టిందని తెలిపారు. ఎంఎల్‌ఎలు, ఎంపీలు ఉన్నా వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను విమర్శించడం లేదన్నారు. ప్రజల తరపున కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తోందన్నారు. అనంతరం అమలాపురం ఆర్టిసి బస్టాండ్ వద్దకు వెళ్లి పల్లె వెలుగు బస్సులో ఉన్న మహిళలతో ముఖ్యమంత్రి చంద్రబాబుకు పోస్టుకార్డులు రాయించారు. ఈ కార్యక్రమంలో పిసిసి ఉపాధ్యక్షులు కొత్తూరు శ్రీనివాస్, అమలాపురం నియోజకవర్గ ఇన్చార్జ్ అయితాబత్తుల సుభాషిణి, పట్టణ అధ్యక్షులు వంటెద్దు బాబి, ముషిణి రామకృష్ణ, కుడుపూడి శ్రీనివాస్, యార్లగడ్డ రవీంద్ర, గెడ్డం సురేష్ బాబు, మాచవరపు శివన్నారాయణ, దేవరపల్లి రాజేంద్ర బాబు, షకీలా, రాయుడు వెంకటరమణ, సాధనాల చిన సత్యనారాయణ, రెడ్డి బాబు, సత్తి సత్తిబాబు, జోగి అర్జునరావు, పులుసుగంటి ప్రకాష్, మొల్లేటి వెంకటేశ్వరరావు, ఏలేశ్వరం రాధాకృష్ణ, రొక్కాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కవి సుబ్బారావుకు ఘన సత్కారం

కొత్తపేట : కొత్తపేటకు చెందిన ప్రముఖ కవి డాక్టర్ వివివిఎస్. సుబ్బారావును శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యాన సోమవారం ఘనంగా సత్కరించారు. తాడేపల్లిగూడెంలో శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యంలో ఈ నెల 19, 20 తేదీల్లో 30 గంటల 30 నిమిషాల 30 సెకన్ల పాటు ప్రపంచ తెలుగు సాహితీ కళాజాతర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుబ్బారావు పాల్గొని 'పండుటాకుల వ్యథ' పద్య కవితా గానాన్ని వినిపించారు. 'సత్య హరిశ్చంద్ర' నాటకం నుంచి వారణాశి సీన్‌లో హరిశ్చంద్రుని ఏకపాత్రాభినయం చేశారు.

ఫ్లయ్ ఓవర్ పనులపై ఎంఎల్ఎ సమీక్ష

ప్రజాశక్తి - ఆలమూరు

216 ఎ జాతీయ రహదారిపై మండలంలోని జొన్నాడ వద్ద నిర్మిస్తున్న ఫ్లయ్‌ఓవర్ పనుల జాప్యంపై కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు సోమవారం హైవే అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా ప్రయాణికుల విజ్ఞప్తులు, ఫిర్యాదుల మేరకు హైవే అధికారులతో కూలంకషంగా చర్చించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనుల జాప్యం జరగడానికి గల ప్రధానమైన కారణాలపై నిలదీశారు. దీనిపై హైవే అధికారులు మాట్లాడుతూ 2025 మార్చి 31 నాటికి పనులు పూర్తి చేస్తామని తెలిపారు. ఇప్పటికైనా పర్యవేక్షణ లోపం లేకుండా ఫ్లయ్‌ఓవర్ పనులు త్వరితగతిన పూర్తిచేసి, ప్రయాణికులకు సౌకర్యవంతమైన రహదారి అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఆకుల రామకృష్ణ, హైవే పీడీ రాజేంద్రనాథ్, ప్రాజెక్ట్ మేనేజర్ బాలసుబ్రమణ్యం, జొన్నాడ సర్పంచ్ కట్టా శ్రీనివాసరావు, మాజీ ఉపసర్పంచ్ తాడి శ్రీనివాస్ రెడ్డి, ఎఎంసి మాజీ ఉపాధ్యక్షులు గొడవర్తి బాబీ, కూటమి నాయకులు నాగిరెడ్డి స్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయ ప్రతిష్టాపన

ప్రజాశక్తి-కొత్తపేట

కొత్తపేట మండలం పలివెలలోని కోట మెరకలో ఆంజనేయ స్వామి ఆలయ పున:ప్రతిష్ఠ ఉత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సాదే లక్ష్మీ శ్రీనివాస్, నల్లా రమణ, మోకా రామ్మోహనరావు, కరెడ్ల మురళి, గొలకోటి శ్రీనివాస్, మోకా సత్తిబాబు పాల్గొన్నారు.

బివి.లంకలో ఉపాధి పనుల గుర్తింపు

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని బడుగువానిలంక గ్రామపంచాయతీ వద్ద ఉపాధి హామీ పథకం 2025-2026 ఆర్థిక ఏడాదికి 51 పనులకు ఆమోదంతో పాటుగా చేయవలసి పనులపై గ్రామ సర్పంచ్ దూలం వెంకటలక్ష్మి సత్తిబాబు అధ్యక్షతన సోమవారం గ్రామసభ నిర్వహించారు. గ్రామానికి సంబంధించిన 10 అభివృద్ధి పనులపై తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ ప్రకాష్, కూటమి నాయకులు పాలూరి గోవిందరాజు, దూలం రాంబాబు, పడాల అమ్మిరాజు, కార్యదర్శి ఎం.విజయరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ మందపల్లి సూరిబాబు పాల్గొన్నారు.



వర్షపు నీటిలోనే ఉన్న పేదల ఇళ్లు

వర్షపు నీటిలోనే పేదల ఇళ్లు

ప్రజాశక్తి-ముమ్మిడివరం

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పేదల ఇళుఉల ముంపు బారిన పడ్డాయి. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని స్థానిక కాశి వాని తూము సెంటర్‌లో సరైన డ్రైనేజీ సౌకర్యం లేక వర్షపు నిలిచి పోవడంతో పలు ఇళ్లు నీట మునిగాయి. ఇప్పటికైనా అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి ముంపు నీరు దిగే విధంగా చర్యలు తీసుకుని, రాబోవు కాలంలో ముంపు సమస్య తలెత్తకుండా పటిష్ఠమైన చర్యలు చేపట్టాలని కోరారు.

పంట కాలువలో వ్యర్థాలు తొలగించాలి

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ఎన్.కొత్తపల్లి ప్రధాన పంట కాలువలో వ్యర్థాల తూడును తొలగించాలని జనసేన పార్టీ నాయకుడు కడియం సందీప్ ఆధ్వర్యంలో గ్రామస్తులు సోమవారం ప్రజా స్పందన కార్యక్రమంలో ఉపాధి ఎపిఒ వి.రాజమణికి వినతిపత్రం అందించారు. పంట కాలువ దుస్థితిని వివరించారు. సుమారు 6 కిలోమీటర్ల మేర ఈ పంట కాలువను అనుకుని ఉన్న నివాస గృహాలు ప్రజలకు వాడుకునేందుకు వంటకాలువ నీరే ఆధారం అన్నారు. వంటకాలువలో ఇష్టానుసారంగా వ్యర్థాలను పడవేయడంతో పాటు గుర్రపుడెక్క, తూడు దట్టంగా పెరిగి కాలువ నీరు ప్రజల అవసరాలకు ఉపయోగకరంగా లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో కె.రంగబాబు, రాంబాబు తదితరులు ఉన్నారు.

పశువుల షెడ్ల నిర్మాణంపై అవగాహన

ప్రజాశక్తి - దేవరపల్లి

సోమవారం దేవరపల్లి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పశువుల షెడ్ల నిర్మాణంపై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఉపాధి హామీ చట్టంలో భాగంగా 2024 - 25 ఆర్థిక సంవత్సరానికి పశువుల షెడ్లు నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్న, మంజూరైన లబ్ధిదారులకు మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు కెవికె.దుర్గారావు, ఎంపిడిఒ వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు అందరికీ పశువుల షెడ్లు కట్టుకునే విధానం గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ శ్రీనివాసరావు, టెక్నికల్ అసిస్టెంట్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు .



వధువుకు చెక్కు అందజేస్తున్న రాము

జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా వధువుకి పెళ్లికానుక

ప్రజాశక్తి-గోకవరం

జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా గోకవరం మండలం అచ్యుతాపురంలో నవ వధువుకు రూ.20 వేల చెక్‌ను క్లస్టర్-2 ఇన్‌ఛార్జి ఉంగరాల రాము చేతులు మీదుగా అందించారు. అచ్యుతాపురం గ్రామానికి చెందిన పెనుముచ్చ గోపి కుమార్తె ప్రసన్నకుమారి వివాహ నిమిత్తం ఈ చెక్‌ను అందించారు. ఈ సందర్భంగా ఉంగరాల రాము మాట్లాడుతూ ఎంఎల్ఎ నెహ్రూ, టిడిపి కాకినాడ జిల్లా అధ్యక్షులు నవీన్ కుమార్ ఆదేశాలతో వీటిని అందించామన్నారు. ఏ పేదింటి ఆడబిడ్డ వివాహ శుభకార్యానికి పిలుపు ఇచ్చినా. శుభలేఖ అందుకుని నవీన్‌కుమార్ తక్షణమే సహాయం అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుమ్మళ్ల దొడ్డి ఎంపిటిసి సభ్యులు కోట సత్యవతి, తిరుమలాయపాలెం సర్పంచ్ పురంశెట్టి శివాజీ, సత్యం పెద్దబ్బులు, కోట పెదసూరిబాబు, కొత్తపల్లి సత్యనారాయణ, నల్లల నాగేశ్వరావు,ఆకుల కాశీ, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు పిట్టా అరుణ్, విఆర్ఒ బి.దివాకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ క్యాంపులను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-ముమ్మిడివరం

నగర వాసులు సౌకర్యార్థం ఏర్పాటు చేస్తున్న మొబైల్ ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ముమ్మిడివరం నగర పంచాయతీ ఇన్ ఛార్జ్ కమిషనర్ కె.సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో మొబైల్ ఆధార్ క్యాంపులలో భాగంగా కొత్త ఆధార్ కార్డు లు, ఆధార్ కార్డులో మార్పులు తదితర విషయాలకు సంబంధించి మంగళవారం నుండి 25 తేదీ వరకు ఈ మొబైల్ ఆధార్ క్యాంపులు నిర్వహిస్తామన్నారు. వీటిలో భాగంగా 22న గొల్లల వీధి, పోలమ్మ చెరువు సచివాలయాలకు సంబంధించి ముమ్మిడివరం జెడ్‌పి బాలుర హైస్కూల్లోనూ, రాజుపాలెం, పల్లిపాలెం సచివాలయాలకు సంబంధించి 23న జెడ్‌పి బాలికల హైస్కూల్లోనూ, బొండాయి కోడు తూము, రాయుడువారిపాలెం సచివాలయాలకు సంబంధించి 24న ముమ్మిడివరం మున్సిపల్ కార్యాలయం వద్ద, సూరాయి చెరువు సచివాలయానికి సంబంధించి 25న సూరాయి చెరువు సచివాలయంలో ఈ ఆధార్ క్యాంపులో ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

'మార్గాని' వివాహ వేడుకల్లో మంత్రి దుర్గేష్

ప్రజాశక్తి- కడియం

కడియం మాజీ జడ్‌పిటిసి సభ్యుడు, కడియపులంక సర్పంచ్ మార్గాని అమ్మాణి ఏడుకొండలు మనవడు అనిల్‌కుమార్ వివాహ వేడుకల్లో పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు. కడియపులంక అపర్ణా సమేత అనంతేశ్వర స్వామి ఆలయం వద్ద సోమవారం జరిగిన ఈ వివాహ వేడుకలలో మంత్రి దుర్గేష్ పాల్గొని వధూవరులను ఆశ్వీదరించారు. ఆయనతో పాటూ ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్, వైస్ ఎంపిపి పంతం గణపతి, సర్పంచ్‌లు అన్నందేవుల చంటి, పాఠంశెట్టి రాంజీ, ముద్రగడ జెమ్మీ, నాయకులు గట్టి నరసయ్య, గట్టి సుబ్బారావు, పల్ల సుబ్రహ్మణ్యం, గిరజాల బాబు, తాడాల చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



తాగునీటి ట్యాంకును ప్రారంభిస్తున్ననాయకులు

ప్రజావసరాలు తీర్చడంలో ముందడుగు వేయాలి

ప్రజాశక్తి - తాళ్లపూడి

ప్రజలకు అవసరమైన పనులతో పాటు గ్రామంలో అభివృద్ధి పనులు చేయడానికి ప్రతి ఒక్కరూ ముందడుగు వేయాలని వైసిపి సీనియర్ నాయకులు యాళ్ల బాబూరావు అన్నారు. మండలంలోని ప్రక్కిలంకలో భక్తాంజనేయ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ సొలస కాశీ విశ్వనాథం తల్లిదండ్రులు ఆంజనేయులు, వీరరాఘవమ్మ, సోదరుడు సుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం రూ.లక్షతో నిర్మించిన వాటర్ ట్యాంకును ఆయన ప్రారంభించారు. గ్రామస్తుల అవసరాలు తీర్చడానికి దాతలు అందిస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో దాత కాశీ విశ్వనాథం, వాసవి దంపతులతో కుటుంబ సభ్యులు మణికంఠ, గ్రామ నాయకులు ముళ్ళ మల్లి బాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల పురోగతి కోసమే పల్లె పండుగ

కడియం : గ్రామాల పురోగతి కోసమే రాష్ట్ర వ్యాప్తంగా పల్లె పండుగ కార్యక్రమం నిర్వహిస్తున్నామని రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్యచౌదరి తెలిపారు. పల్లె పండుగ వారోత్సవాలు పురస్కరించుకుని సోమవారం మురమండ గ్రామంలో రూ.13 లక్షలతో నిర్మించనున్న రోడ్డు, డ్రెయినేజీ పనులకు ,కడియపులంకలో రూ.2.49 కోట్లతో చేపట్టనున్న రోడ్లు, డ్రెయినేజీ పనులకు ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ప్రణాళిక ప్రకారం గ్రామాలను అభివృద్ధి వైపు తీసుకెళ్తున్నామని తెలిపారు. పనులను సంక్రాంతి నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

అనుమతుల్లేని బాలాదిత్య స్కూలు

ప్రజాశక్తి-రామచంద్రపురం

కె.గంగవరం మండలంలోని బట్లపాలిక గ్రామంలోని బాలాదిత్య స్కూలుకు ఎటువంటి అనుమతులూ లేవని దీంతో ఆ స్కూలు మూసివేశామని మండల విద్యాశాఖ అధికారి అలజంగి నాగరాజు సోమవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. ఆ స్కూల్లో విద్యార్థులను చేర్పించితే దానికి ఎవరూ బాధ్యత వహించారని ఈ విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు గమనించి ఆ అనుమతులు లేని స్కూల్లో పిల్లలను చేర్పించవద్దని ఆయన విడుదల చేసిన ప్రకటనలో వివరించారు.

ఐదు వేల మందికి అన్నదానం

ప్రజాశక్తి-కొత్తపేట

దేవీ నవరాత్రులను పురస్కరించుకుని అవిడి గ్రామంలో ఐదువేల మందికి సోమవారం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల నలుమూల నుంచీ వచ్చిన యాత్రిలకు అసౌకర్యం కలగకుండా వంటకాలను వడ్డించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువజన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి-అమలాపురం



సిఎం చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న వేణు

ఇటీవల రాష్ట్రంలో సంభవించిన వరదల వల్ల బాధితులకు స్థానిక సర్ సివి రామన్ పాఠశాల రూ.లక్ష విరాళం అందించింది. ఈ చెక్కును సర్ సివి రామన్ పాఠశాల డైరెక్టర్ రవణం వేణుగోపాలరావు సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ మాట్లాడుతూ సమాజంలో ఇటువంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రతి ఒక్కరూ సహృదయంతో స్పందించి తమ వంతు సహాయం అందించడం కనీస సామాజిక బాధ్యత అన్నారు. అటువంటి సామాజిక స్పృహను సర్ సివి రామన్ పాఠశాల ఎప్పటినుంచో పాటిస్తోందని ప్రశంసించారు. సివి రామన్ పాఠశాల డైరెక్టర్ వేణుగోపాల్ రావును ఆయన అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఉండ్రాజవరం : మండలంలోని పాలంగి సబ్ స్టేషన్ పరిధి, చివటంలో మంగళవారం ఆర్‌డిఎస్ఎస్ పనుల నిమిత్తం మంగళవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపేస్తామనివిద్యుత్ శాఖ ఇఇ ఎస్.నారాయణఅప్పారావు తెలిపారు. గ్రామంలోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గురుకుల పాఠశాల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-ముమ్మిడివరం

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాలని ఎంపి హరీష్ బాలయోగికి స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ కోరింది. మండలంలోని తానేలంక పంచాయతీ పరిధిలోని గురుకుల పాఠశాలలో సుమారు 600 మంది విద్యార్థినులు వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కమిటీ చైర్మన్ నల్లా వీర వెంకట సత్యనారాయణ ఎంపీ హరీష్ మాదుర్ దృష్టికి తీసుకువచ్చారు. పాఠశాల ప్రాంగణంలో పిచ్చి మొక్కలు, తుప్పలు పెరిగిపోయి విష సర్పాల భయంతో విద్యార్థినిలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారాని, పాఠశాల ప్రాంగణాన్ని మెరకు చేసి, క్రీడా ప్రాంగణం అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయించాలని, డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, ప్రహరీ గోడను ఆనుకుని ఉన్న ఆక్రమణలను తొలగించాలని, ప్రహరీ గోడ ఎత్తు పెంచాలని, విద్యార్థినులకు సురక్షిత తాగునీరు అందించేందుకు ఆర్ఓ ప్లాంట్ అందుబాటులోకి తీసుకు రావాలని, ఎల్ఇడి లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ వడ్డి శ్యామ్ ప్రసాద్, దాకే సత్తిబాబు, బీర అన్నవరం, ఎంవి.సూర్యం, సిహెచ్.సుధీర్, లంక వర ప్రసాద్, పినిపే దివ్య భారతి, ఎన్.హైమావతి పాల్గొన్నారు.